క్లుప్తంగా

అక్రమ లేఅవుట్లలో రాళ్ల తొలగింపు



సరిహద్దు రాళ్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

లేపాక్షి: మండల కేంద్రంలో అక్రమంగా వేసిన లే అవుట్లలో వేసిన సరిహద్దు రాళ్లను గురువారం ఈఓఆర్డీ శివన్న, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. హిందూపురం పట్టణానికి చెందిన వెంకటేష్‌కు లేపాక్షి సమీపంలో సర్వే నెంబర్ 395–1లో 3.62 ఎకరాలుంది. ఈ లే అవుట్‌లో పంచాయతీ అనుమతి లేకుండా ప్లాట్లు వేసి విక్రయించడానికి సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న పంచాయితీ అధికారులు అక్కడికి వెళ్లి సరిహదు రాళ్లను తొలగించారు. పంచాయితీ కార్యదర్శి మాట్లాడుతూ అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయరాదని సూచించారు. పంచాయతీ అనుమతి పొందిన లేఅవుట్లను మాత్రమే కొనుగోలు చేస్తే ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తామన్నారు.

హాకీలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని మాధురిబాయి

పెనుకొండ: చాంపియన్ షిప్ సబ్ జూనియర్ ఉమెన్ హాకీలో మాధురి బాయి గోల్డ్ మెడల్ సాధించింది. మండల కేంద్రమైన సోమందేపల్లిలో నివాసం ఉంటున్న మటన్‌షాపు యజమాని రవినాయక్, రేణుకాబాయి చిన్న కుమార్తె మాధురిబాయి ఆర్డీటీ తరపున ఏపీ జట్టులో స్థానం సంపాదించింది. ఈ నెల 24న చెన్నైలోని రాధాకృష్ణ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏపీ జట్టు విజయం సాధించడంతో మాధురిబాయికి ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ అవార్డు కింద గోల్డ్ మెడల్ ఇచ్చారు.

చిత్రలింగేశ్వర, ఎత్తయ్య స్వాముల ఊరేగింపు



విగ్రహాలు తీసుకొచ్చిన దృశ్యం

అమరాపురం: తమ్మడేపల్లిలోని యాదవ కుల దేవతలైన చిత్రలింగేశ్వర, ఎత్తయ్య స్వాముల విగ్రహాలను భక్తులు తమిళనాడు నుంచి గురువారం సాయంకాలం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అమరాపురం నుంచి తమ్మడేపల్లి వరకూ ఊరేగింపు చేపట్టారు. దారి పొడవునా మహిళలు నీటిని దార పోసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా విగ్రహలకు అర్చకులు ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహలను నీటిలో భద్ర పరిచారు. కార్తీక మాసంలో దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు యాదవ సంఘం పెద్దలు తెలిపారు.

మొక్కజొన్నలో పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగం చేపట్టిన అధికారులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో ఖరీఫ్ సీజన్–2023కు సంబంధించి మొక్కజొన్న పొలంలో పంట కోత ప్రయోగం వ్యవసాయాధికారి శ్రీలత పర్యవేక్షణలో నిర్వహించారు. నీటి పారుదల కింద సర్వే నంబర్ 77–16లో 0–43 సెంట్లలో 9.240 కిలోలు, సర్వే నెంబర్ 199–1డిలో 0.83 సెంట్లలో 15.320 కిలోలు దిగుబడి వచ్చిందని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్పలత, వీఎస్ఏ ముత్యాలప్ప, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం పాకెట్లు

మడకశిర: పట్టణంలోని మధుగిరి సర్కిల్ వద్ద గురువారం కర్ణాటక నుంచి మడకశిరకు తరలిస్తున్న 130 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. కర్ణాటకకు చెందిన లక్ష్మమ్మ అనే మహిళ ఈ మద్యం ప్యాకెట్లను తరలిస్తున్నప్పుడు పట్టుకున్నామన్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం రొళ్ల మండల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రధానంగా వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని పెద్ద మెజార్టీతో గెలిపించారని, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. మండల, జేసీఎస్, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు పార్టీని గెలిపించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ మడకశిరలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. వచ్చే నెలలో మడకశిరలో బస్సుయాత్ర ఉంటుందని తెలిపారు. వైఎస్ జగన్ మరోసారి సీఎం చేసుకోవడమే ధ్యేయంగా నూతన మండల కన్వీనర్లు పని చేయాలని కోరారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు,ఎంపీపీ కవిత, మండల కన్వీనర్లు నరసింహారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు మోతిరామ్‌నాయక్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశీలకుడిని కలిసిన నేతలు:

వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ గురువారం నియోజకవర్గంలోని నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. నూతన మండల కన్వీనర్లు రామిరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, యంజారేగౌడ్, త్రిలోక్‌నాథ్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప తదితరులు ఆయనను కలిశారు.

'సురక్ష'తో పేదల ఆరోగ్యానికి భరోసా



వృద్ధుడికి కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అగళి: కోడిపల్లి గ్రామంలో ఎంపీపీ రేణుక ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు గాయత్రి, శివానంద, కాశీ విశ్వనాథ్ 308 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవిప్రసద్, తహసీల్దార్ జ మనూల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: కాకి సచివాలయం ఆవరణలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం పర్యవేక్షించారు. వైద్యులు భారతి, బాలప్రణీత్‌రెడ్డి, చిదానంద్, అనుష్క తదితరులు 366 మంది రోగులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మండల స్పెషల్ ఆఫీసర్ సోని, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ లక్ష్మమ్మ, వైస్ సర్పంచ్ రాజు తదిరులు పాల్గొన్నారు.

గుడిబండ: మద్దనకుంట గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు.

చిలమత్తూరు: 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేద ప్రజలకు వరమని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిలమత్తూరు–2 గ్రామ సచివాలయ పరిధిలోని మరవకొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఓ రామ్ కుమార్, సర్పంచ్‌లు సంధ్య, శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, హరి, నాగరాజుస్వామి, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళాలో 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, అర్హులైన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి 18– 32 ఏళ్లలోపు వారు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మెరుగైన విద్యనందించాలి

పావగడ: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని స్థానిక నూతన బీఈఓ ఇంద్రాణి ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ పదాధికారులకు సూచించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ పదాధికారులు గురువారం ఆమెను కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసన్నమూర్తి, ఉపాధ్యక్షుడు డి సూర్య ప్రకాశ్, కార్యదర్శి అంజినసెట్టి, ట్రెజరర్ అనిల్ కుమార్, పాండు, ఎన్‌సీ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ సౌకర్యంతో ఆర్థిక భరోసా



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్

పెనుకొండ: మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో నగర పంచాయతీ, మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ విధానం పెద్ద పట్టణాలు, మున్సిపాల్టీలకు ఉండేదని, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని పెనుకొండ మున్సిపాల్టీకి తీసుకువచ్చారన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని పి.కొత్తపల్లి గ్రామంలో అనంతశక్తి సొసైటీ న్యాయసలహా మండలి ఆధ్వర్యంలో గురువారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ, గృహింస, వేధింపులు, బాల్యవివాహాల చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళకూ చట్టాలపై అవగాహన అవసరమన్నారు.

అచీవ్‌మెంట్ పరీక్ష పక్కాగా నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రాఘవయ్య

అమరాపురం: విద్యార్థుల అచీవ్‌మెంట్ పరీక్షను పక్కాగా నిర్వహించాలని ఎంఈఓలు రాఘవయ్య, వెంకటరమణనాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నవంబర్ 3న ఉదయం గుర్తించిన పాఠశాలలో 3, 6, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష నిర్వహించాలన్నారు. ఇందుకోసం జిల్లా కామన్ పరీక్షల విభాగం నుంచి ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష ఎలా నిర్వహించాలో ఎంఈఓలు వివరించారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన



జాబితా ప్రదర్శిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని 12 ఆర్‌బీకేల్లో ఖరీఫ్–2023 పంటల నమోదు జాబితా ప్రదర్శిస్తున్నట్లు ఏఓ శ్రీలత తెలిపారు. ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను ప్రతి ఆర్‌బీకేలో గురువారం నుంచి ఈ నెల 28 వరకూ ప్రదర్శిస్తామన్నారు. ప్రతి రైతూ జాబితాను పరిశీలించుకుని ఏదైనా తప్పిదముంటే సిబ్బందికి రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓపెన్ విద్యపై అవగాహన



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ చేస్తున్న అధికారులు

పెనుకొండ: ఓపెన్ విద్యకు సంబంధించి రాష్ట్ర కోఆర్డినేటర్ అక్బర్‌వలి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ విద్యపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. అడ్మిషన్లు, చదువుపై అవగాహన తదితర విషయాలను రాష్ట్ర కోఆర్డినేటర్ వివరించారు. కార్యక్రమంలో అధికారులు డ్రైవర్ రమణమూర్తిని ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ చేశారు. డీవైఈఓ రంగస్వామి, లాజర్, స్కిల్ కోఆర్డినేటర్ శివప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'కాకి'లో జ్యోతుల ఉత్సవం



కొల్హాపురి మహాలక్ష్మీదేవిని ఊరేగింపుగా తీసుకువెళుతున్న కాకి గ్రామస్తులు

రొళ్ల: మండలంలోని కాకి గ్రామంలో శుక్రవారం రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. వేడుకలకు టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు. రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా గురువారం సాయంత్రం కాకి స్వగ్రామానికి తీసుకెళ్లి గ్రామం నడిబొడ్డున పట్టం కూర్చోబెట్టారు. ఏటా కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

తాగునీటి కార్మికుల సమస్యలపై విచారణ

హిందూపురం టౌన్: హిందూపురం, పెనుకొండ పరిధిలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ సమస్యలపై ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ అధికారి కేశవనాయుడు విచారణ చేపట్టారు. గురువారం పట్టణంలోని శ్రీరామిరెడ్డి వాటర్ పంప్ హౌస్ వద్ద ఆయన కార్మికులతో మాట్లాడారు. కార్మికులు లేకున్నా పేర్లు నమోదు చేసి వారి బ్యాంకు ఖాతాల ద్వారా జీతాలు వేయడాన్ని కార్మికులు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పీఎఫ్ కార్మికుల నుంచి రూ.2500 కట్ చేసి, వాటిని చెల్లించడం లేదని విషయాన్ని గుర్తించారు. స్టేట్‌మెంట్‌లో ఉన్న పేర్లను వరుస సంఖ్యలో పిలుస్తుంటే హాజరుకాని వారు ఎక్కడున్నారు, ఏ పనిచేస్తున్నారని సూపర్‌వైజర్లను విచారణ అధికారి ప్రశ్నించారు. అనంతరం కార్మికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నరసింహప్ప, వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సోమశేఖర్, మంజునాథ్, బాలు, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'కంటి వెలుగు'

లేపాక్షి: వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదలకు వరమని సర్పంచ్ ఆదినారాయణ అన్నారు. లేపాక్షి పంచాయతీ పరిధిలోని గలిబిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు గురువారం పంపిణీ చేశారు. అలాగే ఆయుష్మాన్ అభా హెల్త్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లావణ్య, ఏఎన్ఎం కామాక్షి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దళిత పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుల హర్షం

పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావును నియమించడం హర్షణీయమని దళిత పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, విశ్రాంత ఎంపీడీఓ నారాయణస్వామి, రిటైర్డ్ వార్డెన్ సుబ్బయ్య గురువారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన వర్గాలకు ఉన్నత హోదా కల్పిస్తూ, వారిని ముందుకు తీసుకెళ్లడంలో ప్రత్యేక దృష్టి నిలిపారన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

రొద్దం: మండల కేంద్రానికి చెందిన గాజుల నారాయణప్ప (65) వైఎస్సార్ సీపీ కార్యకర్త అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌ఫ రవిశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, జిల్లా సేవాదళ్ రాజగోపాల్‌రెడ్డి, డీలర్ ముత్యాలు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కార్గో సేవలు' వినియోగించుకోండి

పుట్టపర్తి టౌన్: అతి తక్కువ ధరకే సరుకులు చేరవేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి డిపోలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 84 కేంద్రాల్లో కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 10 కిలోమీటర్ల వరకూ ఈ కేంద్రాల ద్వారా సరుకులు డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 25 వరకూ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. డిపోల్లో ఉద్యోగులతో కలసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



ప్రసంగిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త టి.ఎన్.దీపిక. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే దక్కుతుందని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమం నియోజకవర్గ సమన్వయకర్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో కౌన్సిలర్ శివ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, పార్టీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు హాజరయ్యారు. దీపిక మాట్లాడుతూ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజల చల్లనిచూపు మరోసారి జగనన్నపై వైఎస్సార్‌సీపీపై ఉండాలన్నారు. నవంబర్ 1 నుంచి ప్రజల్లోకి ఈ కార్యక్రమాన్ని సచివాలయాలవారీగా పార్టీ కార్యవర్గ నాయకులు, వలంటీర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు తీసుకెళ్లాలన్నారు. క్లస్టర్ల వారీగా ఈ కార్యక్రమం 30 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అపద్దాల హామీలతో చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

రానున్న 30 ఏళ్లు జగనన్నే కావాలి

మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ జగనన్న చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల కష్టనష్టాలు చూచి అధికారంలో చేపట్టిన తర్వాత వారి అభ్యున్నతికి వలంటరీ, సచివాలయ వ్యవస్థ అమలు చేసి ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా చేర్చడానికి కృషిచేశారన్నారు. అందుకే ప్రజలు ఇంకా 30 ఏళ్లు జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. ఇంతపెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయ సహకారాలు అందించింది చరిత్రలో లేదని, అందుకే ప్రజలు తిరిగి జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ ఎగుర వేయడానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, జేసీఎస్ రాష్ట్ర కన్వీనర్ మారుతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, పట్టణ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు సీపీపీ బాషా, నరేష్, మండల కన్వీనర్లు రాము, నారాయణస్వామి, ప్రభాకర్, నాయకులు శ్రీరాంరెడ్డి, నాగమణి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మరింత బలోపేతం కావాలి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న యువతకు పార్టీ కండువాలు వేస్తున్న టీఎన్.దీపిక

హిందూపురం: జగనన్న ప్రజా సంక్షేమపాలనతో హిందూపురం నియోజవకర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమవుతూ ప్రజలందరికీ చేరువ అవుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, సమన్వయకర్త టి.ఎన్.దీపిక అన్నారు. గురువారం ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో దీపిక, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో చిలమత్తూరు వాల్మీకి నరేష్‌తోపాటు టీడీపీ నుంచి సుమారు వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ జగనన్న ప్రజా సంక్షేమ పాలన, అందిస్తున్న పథకాలు ఎంతో ఆకర్షించాయని పార్టీ అభ్యున్నతి కోసం కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్, ఎంపీటీసీలు హరీష్, రాఘవేంద్ర, షకీర్, భాస్కర్, సర్పంచ్‌లు మురళి, తిరుమలేష్, శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హనుమంతరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, రామచంద్ర, ఆయుబ్, నవీన్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం విషాదకరం

కర్ణాటకలోని చిక్‌బళ్లాపురం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం చాలా విషాదకరమని హిందూపురం సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. ప్రమాదంలో 13 మంది మృతి చెందడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ఆమె సంతాపం తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గోరంట్ల వాసులు 13 మంది మృత్యువాతకు గురికావడం దిగ్భ్రాంతిని కల్గించిందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. అలాగు జరిగిన ప్రమాదం విచారకరమన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

అగళి: మధుడి గ్రామంలో వెలిసిన వీరభద్ర స్వామి ఆలయంలో గురువారం రాత్రి అగ్నిగుండం మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అగ్నిగుండంలో దూపాన్ని వేసి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండం వద్ద అరటి కొమ్మలు నరికి బలిదానం చేశారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల: దొడ్డేరి, రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈఓలు మోహన్, శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. నాడు–నేడు పనులపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఎఫ్ఏ–2 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను పరిశీలించారు.